వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 152
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
మార్చి 11, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## కమిషనరేట్ ఎదుట వ్యక్తి ఆందోళన



8లో..

- తమ్ముడు తన భూమిని కబ్జా చేశాడని ఆరోపణ
- న్యాయం చేయాలని సీపీకి విజ్ఞప్తి

# అధికారులు vs అయ్యగార్లు



భక్తులు కోరిన కోర్కెలు తీర్చుతూ కొంగుబంగారంగా వెలుగొందుతున్న శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆధిపత్య పోరు ఎక్కువైంది. అధికారులు, అయ్యగార్ల మధ్య గ్యాప్ పెరిగిపోయింది. నువ్వా.. నేనా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల మాటలకు వారు ఏమాత్రం విలువనివ్వడం లేదు. అసలు ఎంతమంది అయ్యగార్లు ఉన్నారు.. ఎక్కడెక్కడ ఉన్నారన్న సమాచారం కూడా కరువైంది. భక్తితో అమ్మవారిని దర్శించుకునేందుకు ఓరుగల్లునుంచే కాకుండా చుట్టు పక్కల జిల్లాల నుంచి నిత్యం వేలాదిగా తరలి వచ్చిన భక్తులను పూజారులు చులకన భావంతో చూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అమ్మవారి సన్నిధిలో భక్తుల గోత్ర నామాలతో అర్చనలు చేస్తూ భక్తి మార్గాన్ని అనుసరించాల్సిన పూజారులు అనవసర రాద్ధాంతాలలో తల దూర్చుతూ భక్తులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. నిండు మనసుతో ఆశీర్వదించాల్సిన అయ్యగార్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని భక్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. దక్షిణ ఇచ్చేవారిపైనే పూజారులు దృష్టి సారించడంపై మండిపడుతున్నారు. నచ్చినవారిపేరిట అర్చనలు చేస్తూ నచ్చనివారివైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయ్యగార్లు అంతా మేమే అన్నట్లుగా వ్యవహరించకుండా భక్తితో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన వారితోనూ సానుకూలంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందంటున్నారు భక్తులు. అప్పుడే భద్రకాళి అమ్మవారి ప్రాశస్త్యం దశదిశలా విస్తరిస్తుందంటున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి



- భద్రకాళిలో ఆధిపత్య పోరు
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పూజారులు
- నచ్చినవారిపేరిట అర్చనలు
- దక్షిణ ఇస్తేనే శఠగోపం



8లో..

## 16న సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



8లో..

## కళ్లుండి చూడలేని కబోది హరీష్ రావు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



2లో..

## అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

- ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించేది లేదు
- మున్సిపల్ కార్పొరేషన్ ప్రక్షాళన తప్పనిసరి
- ఎమ్మెల్యే, మేయర్, కుడా చైర్మన్, కమిషనర్ సమీక్ష



2లో..

## కొండపర్తిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా
- ములుగులో పర్యటించిన గవర్నర్ జిష్ణు దేవ్
- సమ్మక్క- సారలమ్మలకు ప్రత్యేక పూజలు

పెద్ద కర్మ

స్వస్తి శ్రీ క్రోధి నామ సం॥పాల్గుణ శు॥ తదియ
తేది:02-03-2025 ఆదివారము రోజున రా॥గం॥8-08 ని॥లకు
మా తల్లి గారైన
శ్రీమతి వన్నాల విజయ (జయక్క)గారు
స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతించుచున్నాము.
తేది: 12-03-2025 బుధవారము రోజున ఏకాదశదినకర్మ, మహదాశీర్వచనము జరుగును.
కావున తామెల్లరు విచ్చేసి, మా తల్లి గారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి.



కార్యస్థలము :
పెద్దకర్మ పూజ : అడ్వకేట్స్ కాలనీ, హన్మకొండ.
సెల్ నెం.9000166397
సహపంక్తి భోజనం :
డి-కన్వెన్షన్ హాల్, హంటరోడ్, హన్మకొండ.
ది. 12-03-2025, బుధవారం రోజున
మధ్యాహ్నం గం॥ 12-30 ని॥లకు

ఇట్లు
భర్త : వన్నాల శ్రీరాములు, మాజీ శాసన సభ సభ్యులు
కుమారులు : డా॥వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బి.జె.పి.
అరవింద్ కుమార్, రాజేష్ కన్నా
కోడళ్లు, మనుమరాళ్ళు - మనమలు









# కొండపర్తిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- మౌలిక వసతుల కల్పనకు కృషి
- ములుగులో పర్యటించిన గవర్నర్ జిష్ణు దేవ్
- సమ్మక్క-సారలమ్మలకు పూజలు

**వరంగల్ వాయిస్, ములుగు :** శ్రీ సమ్మక్క–సారలమ్మ ములుగు జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ మంగళవారం మేడారం సమ్మక్క – సారలమ్మకు మొక్కులు చెల్లించి, నిలువెత్తు బంగారం సమర్పించి, అమ్మవారికి పత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క, శ్రీ సమ్మక్క సారలమ్మ ల ప్రాశస్త్యం గురించీ గవర్నర్ గారికీ వివరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గవర్నర్ మాట్లాడుతూ ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం కొండపర్తి, గ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగిందని, గ్రామం తనను ఎంతగానో ప్రభావితం చేసిందన్నారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, పాఠశాల వాతావరణం అంతర్గత రోడ్లు నిర్మాణం అన్ని మౌలిక వసతుల కల్పన కొసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. అయన వెంట రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ దివాకర టీఎస్, ఏటూరు నాగారం, ఐటీడిఏ పీఓ. చిత్ర మిశ్రా, ఎస్పీ శబరిష్, తదితరులున్నారు.







# అవినీతినికి పాల్పడితే చర్యలు తప్పవు

- ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించేది లేదు
- మున్సిపల్ కార్పొరేషన్ ప్రక్షాళన తప్పనిసరి
- ఎమ్మెల్యే, మేయర్, కుడా చైర్మన్, కమిషనర్ సమీక్ష

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బడ్జెట్ చివరి మాసం, కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టే క్రమంలో నియోజవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను ప్రారంబించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం రోజున కూడా కార్యాలయంలో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజవర్గ సమీక్ష సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి,కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రామ్ రెడ్డి, కమిషన్ అశ్విని తానాజీ వాకడేలతో కలిసి సమీక్షించారు. నగరంలో పెండింగ్ లలో ఉన్న పనులను త్వరితగతిన ప్రారంభించాలని, స్మార్ట్ సిటి నిధుల ద్వారా జరుగుతున్న పనుల పురోగతిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. రోడ్డు విస్తరణ,భద్రకాళి అభివృద్ధిలో ఇళ్లు కోల్పోతున్న వారికి రెండు పడకల ఇళ్లు ఇచ్చేలా చూడాలని కోరారు. నిజమైన అర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి బండ్ పనులు 75శాతం జరిగిందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.



### వేసవికాలం ఆక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

వేసవికాలం సమీపించిన సమయంలో నగరంలోని ప్రజలకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మూతబడిన బోర్లను వెంటనే మరమత్తులు చేయాలని,అవసరం ఉన్న ప్రాంతాల్లో కొత్త బోర్లకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.వేసవితాపం తీర్చేందుకు మూడు నెలలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలకు నియోజవర్గంలో ఉన్న 24 ప్రధాన పార్కులలో మరమత్తులు చేపట్టాలని సూచించారు. మున్సిపల్,కూడా అధికారులు ఉద్యానవనం శాఖ అధికారులు సమిష్టిగా నగరంలో మొక్కల పెంపకం,పచ్చదనం పై నూతన ఒరవడికి నాంది పలకాలని కోరారు. చాలా చోట్ల మొక్కలు నాటాల్సిన ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయడం వల్ల మొక్కల పెరుగుదల లేదని అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రక్షాళన చేయాలని,అవినీతికి పాల్పడుతున్న అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు అవినీతికి పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమీక్షలో చేపట్టిన అంశాల పట్ల అధికారులు కింది స్థాయి ఉద్యోగులతో క్షేత్ర స్థాయిలో పరిశీలించండి అని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,ముఖ్యమంత్రి వరంగల్ నగర అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో ప్రజా పాలన సాగించాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**వరంగల్ వాయిస్, తొర్రూరు:** పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనగామ, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల గ్రామీణ నీరు సరఫరా (ఆర్ డబ్ల్యూఎస్) అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి మాట్లాడుతూ రాబోయే వేసవి కాలంలో మంచినీటి కొరత ఎదురుకాకుండా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా సమయానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు కఠిన సూచనలు చేశారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లాల నీటి సరఫరా శాఖ అధికారులు, ఇంజినీర్లు, గ్రామ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రాధాన్యం అనే దృక్పథంతో ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్పష్టం చేశారు.



3

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, మార్చి 11, 2025

# శ్రామిక మహిళా పోరాటాలు వర్ధిల్లాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మహిళా పెన్షనర్స్ ఫోరం, ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని అసోసియేషన్ కార్యాలయంలో డి జ్యోతి రమణి అధ్యక్షతన "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" నిర్వహించారు. ఈ సమావేశంలో వక్తలుగా అనిశెట్టి రజిత (ప్రజాస్వామిక రచయితల సంఘం), బి రమాదేవి (టీపీఎఫ్)లు హాజరు కాగా, వేదిక పైన జిల్లా కమిటీ సభ్యులు సుమ, రాజ కొమురమ్మలు హాజరు కావటం జరిగింది. ప్రధాన వక్తలు అనిశెట్టి రజిత, బి.రమాదేవిలు తమ ప్రసంగంలో " ఈ రోజు ను శ్రామిక మహిళా పోరాట దినం" గా వ్యవహరించాలని కోరారు. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలే మహిళల విద్యకు, అభివృద్ధికి కృషి చేసిన విధానాన్ని వివరించారు. ఇప్పటికీ కూడా మహిళలు పూర్తి సాధికారత సాధించలేదని, అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ, కుటుంబంలో తగిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లేకుండా వుంటున్నారని, మహిళలు చైతన్యవంతులు అయితేనే ఈ దేశం, సమాజం అభివృద్ధి దిశలో పయనిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా




పోటీలలో విజేతలకు మెంమొంటోలు అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.వీరాస్వామి,రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిశోజు రామ మనోహర్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రు సుధీర్ బాబు, యన్.సదానందం, గౌరవ అధ్యక్షులు తుమ్మ వీరయ్య, హనుమకొండ సహా అధ్యక్షులు కె.సమ్మారెడ్డి, సుకుమార్ రెడ్డి, సింగారెడ్డి, సత్యనారాయణ, శ్యాంసుందర్ రెడ్డి తదితరులతో పాటు 50 మంది మహిళా పెన్షనర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, చిట్యాల :** రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి పనులను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర  సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం చిట్యాల మండలంలోని గోపాలపురం ముచినపర్తి, చల్లగరిగే, జుకల్, తిరుమలాపూర్, చిట్యాల, నవాబుపేట, చింతకుంట, రామయ్య పల్లి, కైలాపూర్, శాంతి నగర్, బావ్ సింగపల్లి, గాంధీనగర్, చెంచు కాలనీ, నైన్ పాక, వెంచరామి, చైన్ పాక, కురుమ పల్లి, వివిధ గ్రామాలకు బీటీ రెన్యూవల్ రోడ్లు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, బతుకమ్మ తల్లి, మోడల్ స్కూలు మైదానం కోసంగ్రావెల్ ఫిల్లింగ్  లెవలింగ్ వివిధ పనులకు ఎమ్మెల్యే పార్టీ శ్రేణులతో కలిసి శంకుస్థాపన చేశారు. వీటికి  తొమ్మిది రూ.కోట్ల 20 లక్షలు బడ్జెట్ కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నల అభివృద్ధి కోసం నిత్యం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదేవిధంగా చిట్యాల మండల పార్టీ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమ ఎంపీడీవో జయశ్రీ, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీ కృష్ణ, మూలశంకర గౌడ్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ కమిటీకి టీ షర్ట్ల అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం :** గణపురం మండల కేంద్రంలోని పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో మంగళవారం ఫ్రొబెల్ మోడల్ హైస్కూల్ యాజమాన్య బృందంచే ఆలయంలో స్వామికి ప్రత్యేక  పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధిలో ప్రతిరోజు పనిచేస్తున్న కమిటీ సభ్యులకు పట్టాభి సీతారామచంద్ర స్వామి చిత్రపటాన్ని ముద్రించిన టీ షర్ట్ లను ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. అదేవిధంగా యాజమాన్య బృందానికి ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. యాజమాన్య బృందానికి ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూల శ్రీనివాస్ గౌడ్, బూర రాజగోపాల్, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి, పాండవుల భద్రయ్య, బటిక స్వామి, దెయ్యాల భద్రయ్య, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# శంభాజీ మహారాజ్‌కు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, గణపురం :** హిందూ హృదయ సామ్రాట్ చత్రపతి మహారాజ్ తనయుడు శంబాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఘనపురం మండల కేంద్రంలోని ప్రోబెల్ మోడల్ హైస్కూల్ చావ చిత్రాన్ని గణపురం మండల కేంద్రంలోని లక్ష్మీ శ్రీనివాస థియేటర్ లో వీక్షించడం జరిగింది. అలాగే బీజేవైఎం కళాశాలల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్ ఆధ్వర్యంలో ఛత్రపతి శంభాజి మహారాజ్ వర్ధంతి సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించి ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుంకరి జగన్ రెడ్డి, ల్యాదల్ల యాదగిరి గౌడ్, పబ్బ శివ శంకర్ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పూడికతీత మట్టి తరలింపు వేగంగా జరగాలి

## కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తరలింపు ప్రక్రియ వేగవంతంగా  జరగాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం భద్రకాళి చెరువు లో పూడికతీత పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే  తో కలిసి పరిశీలించారు. భద్రకాళి చెరువు నుండి పూడికతీత మట్టి తరలింపు రూట్ మ్యాప్, వాహనాల రాకపోకలకు సంబంధించి వేస్తున్న ఫార్మేషన్ రోడ్డు పనులు, మట్టి తరలించేందుకు ఇచ్చే వాహనాల కూపన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, సాగునీటిపారుదల శాఖ ఈఈ శంకర్, డీఈ హర్షవర్ధన్ , కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా అన్న ప్రసాద వితరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని పిన్న వారి వీధిలో మంగళవారం ఇటీవల మరణించిన ప్రముఖ వ్యాపారవేత్త కేవన్ మూర్తి జ్ఞాపకార్థం (సంస్మరణ) మిత్రులు, స్థానికులు సంయుక్తంగా పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్ విచ్చేసి కేవన్ మూర్తి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం 2000 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా తోట సంపత్ కుమార్ మాట్లాడుతూ కేవన్ మూర్తి గుణగణాలను, దయా గుణాలను కొనియాడారు. పెద్ద ఎత్తున జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు, మిత్రులు, వ్యాపారవేత్తలు తోట శివకుమార్, మామిడాల సుధాకర్, వల్లాల నాగేశ్వరరావు, గుడ్డుస్ శ్రవణ్, తోట నరసయ్య లింగం, చౌదలాల్ ,తిరుమల రమేష్, విష్ణుభహతి, డాక్టర్ పోలా నటరాజ్, దండు దయాసాగర్, కూసం రమేష్, గోలింగరావు, వల్లాల రాజు, గోపి, పెనుమల్ల అమర్, దివ్వెల పూర్ణచందర్, రాందేవ్, రేవంత్, బైరి సర్వేశ్వర్, బాకటి, హరిలాహటీ, కామిశెట్టి వెంకన్న, రవి, అడ్డగీతి గిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పల్లెదవాఖాన డాక్టర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ను మంగళవారం మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ ఘనంగా ఆవిష్కరించారు. జిల్లా పల్లె దావఖానాలలో ఆయుర్వేద వైద్యులచే గ్రామీణ ప్రజలకు సరైన వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, పల్లె దావఖాన వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ షఫీ, డాక్టర్ నవీన్, డాక్టర్ స్వాతి, డాక్టర్ రవళి, డాక్టర్ ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగులకు బదిలీలు సహజం

## ఎంఈఓ రఘునందన్ రెడ్డి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని రఘునాథపల్లి మండల విద్యాశాఖ అధికారి రఘునందన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జాఫర్ గూడెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శాగ కైలాసం అధ్యక్షతన జరిగిన అనురాధకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి పాల్గొని మాట్లాడారు. ఉద్యోగి తన పదవి విరమణ చేసేంత వరకు తన సర్వీసును వివిధ పాఠశాలల్లో తప్పకుండా నిర్వర్తించాల్సి ఉంటుంది. కాబట్టి, అనురాధ కూడా మన జాఫర్ గూడెం పాఠశాలలో గత రెండు సంవత్సరాలుగా పనిచేసి ఇటీవల గీసుకొండ మండలానికి బదిలీపై వెళ్లిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. రఘునాథపల్లి మండలంలో ఏవిధంగానైతే మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారో, అదేవిధంగా అక్కడ కూడా మీ సేవలు పాఠశాలకు అంకితం చేసి మంచి పేరు తెచ్చుకుంటారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖిలా షాపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ భారత రవీందర్, జాఫర్ గూడెం పాఠశాల ఉపాధ్యాయులు సునీల, శివకుమార్, సీఆర్పీ శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ఆసుపత్రులపై కఠిన చర్యలు

**డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో సంభవించిన మాతృ మరణాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి ఒక ఎక్స్ పర్ట్ కమిటీని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు తెలిపారు. ఎక్స్పర్ట్ కమిటీ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ప్రతిమ క్యాన్సర్ హాస్పిటల్, అపోలో ఎన్ఎస్ఆర్ వైస్ హాస్పిటల్ లలో ఆకస్మిక తనిఖీలు చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్లినిక్ లు, పోలీ క్లినిక్ లు, హాస్పిటల్స్ నడిపే వారు తప్పనిసరిగా నియమనిబంధనలు పాటించాలని కోరారు. జిల్లాలో తనిఖీ బృందాలు నిరంతరం క్లినిక్ లు, ఆస్పత్రులు, తనిఖీ చేస్తుంటాయని, తనిఖీ అధికారులు అడిగిన వెంటనే అన్ని రకాల అనుమతులకు సంబంధించిన సర్టిఫికెట్లు, సిబ్బంది వివరాలు చూపించాలని కోరారు. ఎవరైనా క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్, పీసీపీఎన్ డీటీ ఆక్ట్ లకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపైన చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్చన, డిప్యూటీ అనిల్ కుమార్, మనోజ, ఎల్డీ కంప్యూటర్ నాగరాజు పాల్గొన్నారు.

# ఖమ్మంపల్లి-భూపాలపల్లి రోడ్డుకు నిధులు మంజూరు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** పెద్దపల్లి జిల్లా ఖమ్మం పల్లి నుంచి తాడిచెర్ల మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి, అటవీ అనుమతుల కోసం రూ.33 కోట్ల 70 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, మాజీ ఎంపీపీ మల్హల్ రావు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిత రాజి రెడ్డి, ఎస్సీ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# రంయ్యాల శ్రీధరాచార్యులకు పురస్కారం




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని పోచమ్మ మైదానం ఎల్ బీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూం అలీలో తెలుగు ఉపాధ్యాయులు ప్రముఖ వ్యాఖ్యాత గాయకులు తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2023 గ్రహీత డాక్టర్ రంయ్యాల శ్రీధరాచార్యులకు జాతీయ స్థాయి బంగారు నంది పురస్కారంతో జీసీఎస్ వల్లూరి పౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో జరిగిన కార్య క్రమంలో అవార్డు అందజేశారు. వల్లూరి పౌండేషన్ చైర్మన్ శ్రీనివాస రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మహిళ కార్పొరేషన్ చైర్మన్ బి.శోభారాణి మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి అవార్డు గ్రహీతలను ఎంపిక చేసుకోవడం ఆనందదాయకమని, సంస్థకు గల పేరు ప్రఖ్యాతులు దీని ద్వారా ద్యోతక మవుతుందని సంస్థ చైర్మన్ శ్రీనివాస రాజును అభినందించారు. ఈ కార్య క్రమంలో ప్రఖ్యాత జ్యోతిష్యులు దైవజ్ఞ శర్మ, వల్లూరి పౌండేషన్ మహిళ అధ్యక్షురాలు కె.కృష్ణవేణి, కె సుధాకర్, నవీన్ కుమార్, జి.సుధాకర్ పాల్గొన్నారు.

# రైతులకు కొత్త పంట రుణాలు అందించండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం తెలంగాణ రాష్ట కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అధ్యక్షతన డీసీసీబీ బ్యాంక్ మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణ మాఫీ-2024 కింద లబ్ధి పొందిన రైతులకు త్వరగతిన తిరిగి కొత్త పంట రుణాలు ఇవ్వవలసిందిగా సూచించారు. అదేవిధంగా అర్హత గల రైతులకు సంబంధించిన ఇన్వాలీడ్ ఆధార్ లుగా ఉన్నటువంటి ఎర్రర్ లను ప్రభుత్వం వారి అనుమతితో సరైన ఆధార్ కాపీలను సమర్పించి రైతులకు లబ్ధి చేకూరేలా చేయాలని సూచించారు. నిర్దేశించిన టార్గెట్స్ అన్నింటిని గడువులోగా సాధించాలని, ప్రతి నెల వారీగా వ్యక్తిగత పెర్ఫార్మన్స్ ఇంప్రూవ్ అవ్వని యెడల తగిన చర్యలు తీసుకోవాలని సీఈఓను ఆదేశించారు. సంఘాల ద్వారా ఇచ్చి ఉన్న రుణాలను కూడా లీగల్ గా రికవరీ చేసి సంఘాలను పటిష్టం చేయాలని సూచించారు. IRAC నామ్స్ కి లోబడి 31.03.2025 సంవత్సరానికి గాను నిరార్థక ఋణాలుగా వర్గీకరించబడిన మొండీ బకాయిలను 2% కి మించకుండా రికవరీ చేయాలనీ మేనేజర్లను ఆదేశించడం జరిగింది. NPA 2శాతం లోబడి టర్నోవర్ రూ.2500 కోట్లకు చేరుకునేలా ప్రయత్నం చేయాలన్నారు.

తదుపరి జరగబోయే నాబార్డ్ వారి సమీక్షలో కూడా మన బ్యాంక్ ఏ ర్యాంకు అవార్డుగా పొందడానికి అందరూ ఆర్బీఐ, నాబార్డ్ వారి ఆదేశాలను పటిస్తూ బ్యాంక్ అబివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఈఓ వజీర్ సుల్తాన్, జీఎం ఉషా, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, గొట్టం స్రవంతి, బోడ రాజు, గంప శ్రవంతి, కృష్ణ మోహన్, డీఆర్ ఓఎస్డీ విజయ కుమారి, వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు మండలంలోని 17 మందికి గాను రూ.5,91,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు మాజీ సర్పంచులు పర్వతగిరి రాజు, కంచ రవికుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్యం స్వామి, మాజీ జడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, అక్కంపేట గ్రామ అధ్యక్షులు కృష్ణంరాజు, ఆత్మకూరు గ్రామ ప్రధాన కార్యదర్శి అల్వాల రవి, మార్తకేదారి, మండల నాయకులు కొండే కృష్ణంరాజు, పెద్దాపురం మాజీ వార్డ్ మెంబర్ రాజమౌళి పాల్గొన్నారు.



# దేవాలయ స్థలాన్ని కాపాడండి



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** నగరంలోని 66వ డివిజన్ లో గల మహంకాళి దేవాలయం స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం గావిస్తున్న వల్లాల రాజేందర్ పై చర్య తీసుకుని ఇంటి నిర్మాణాన్ని నిలుపుదల చేసి వల్లాల రాజేందర్ కు సంబంధించిన ఇంటి పత్రాలను పరిశీలించిన తర్వాతనే నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ జీడబ్ల్యూఎంసీ 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అనుమాండ్ల విద్యాసాగర్, పిట్టల కుమారస్వామి, పావు శెట్టి శ్రీధర్, దీకొండ భిక్షపతి, పెద్దమ్మ శ్రీనివాస్, జన్ను కిషన్, కేదాసి రాకేష్, దాడి రాజు, వలస జ్ఞానేశ్వర్, కుంబార్ కార్ సాయి, మేకల హరిశంకర్, మేకల యుగంధర్, మేకల ప్రకాష్, మొదలగు వారు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణం, మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సుమారుగా 250 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, ఉపయోగపడే పలు వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులగా విచ్చేసిన పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ చదువుతోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలన్నారు. 10వ తరగతి తోనే భవిష్యత్ కు తొలిమెట్టని సూచించారు. అదే విధంగా పదవ తరగతి లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ పదవ పరీక్షల్లో కరీంనగర్ జిల్లాలోనే జమ్మికుంట మండలం అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. అదే విధంగా 10/10 సాధించిన విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించే విధంగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, జమ్మికుంట ఇల్లందకుంట



దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మోలుగురి సదయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుడిగే శ్రీకాంత్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి రేణుకా, ఫిషరీష్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగిలి రాకేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గంగారపు మహేష్, మండల ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు పంజాల అజయ్, చెన్నావేనా రమేష్, శనిగరపు తరుణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతకాల అనిల్, దిడ్డి రాము, శ్రీహరి దొడ్డే నవీన్, ఏభూషి అజయ్, పాతకాల రమేష్, కమలాకర్ పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, మార్చి 11, 2025

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

## ● ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల టౌన్, మండలం, నడికూడ, ఆత్మకూర్ మండలాలకు చేసిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సీఎం ఆర్ఎఫ్ పేద ప్రజలకు వరమన్నారు. గతంలో ఎమ్మెల్యే, ఎంపీల కార్యాలయాల వద్ద చెక్కుల కోసం పడిగాపులు కాచేవారని నేడు లబ్ధిదారులకు నేరుగా అందజేయడం జరుగుతుందన్నారు. పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిలుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఆర్థిక సహాయం 1556మందికి 15 కోట్ల 57 లక్షల 78వేల 496 రూపాయలు, సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా 1173 మంది లబ్ధిదారులకు 3కోట్ల 68 లక్షల 61 వేల రూపాయలను, ఎల్ఓసీ పథకం ద్వారా 69 మందికి 1 కోటి 33 లక్షల 91వేల రూపాయల విలువ గల చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సీఎంఆర్ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ వాటిని కూడా మంజూరు చేశామన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. పరకాల నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు రూ.200 కోట్ల నిధులు కేటాయించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ధన్యాదాలు తెలిపారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరపున బాధ్యతగా నేరుగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తూ,అర్హులైన పేదలకు న్యాయం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో జరుగుతుందన్నారు.

# రామగుండం సీపీగా బాధ్యతలు చేపట్టిన అంబర్ కిశోర్ ఝా



**వరంగల్ వాయిస్, రామగుండం :** వరంగల్ పోలీసు కమిషనర్ గా ఉన్న అంబర్ కిశోర్ ఝా రామగుండల కమిషనర్ గా ఇటీవల బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం రామగుండం పోలీసు కమిషనర్ గా అంబర్ కిశోర్ ఝా బాధ్యతలు చేపట్టారు.

# తిలక్ రోడ్డు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా పూర్ణేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తిలక్ రోడ్డు, అనుబంధ వీధుల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా అదే ప్రాంతానికి చెందిన లక్కిరెడ్డి పూర్ణేందర్ రెడ్డి నియమితులయ్యారు. రామ రవీందర్ అధ్యక్షతన తిలక్ రోడ్డులో ఈ మేరకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పూర్ణేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి బాటలు వేసేలా కృషి చేస్తానన్నారు. కమిటీ సభ్యులు కూడా తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. తనను కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంటి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

## • కార్పొరేటర్ పల్లం పద్మ రవి

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఇంటి పన్ను చెల్లించి నగర అభివృద్ధిలో పాలుపంచుకోండని కార్పొరేటర్ పల్లం పద్మ రవి డివిజన్ ప్రజలకు పిలుపునిచ్చారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి మంగళవారం డివిజన్ లో మున్సిపల్ బిల్ కలెక్టర్ ప్రేమ్, వార్డు ఆఫీసర్ రాజేశ్వరితో కలిసి ఇంటి పన్ను వసూలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణలో హైదరాబాద్ కు సమానంగా వరంగల్ అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని, అభివృద్ధిలో పాలుపంచుకోవాలని, ప్రతి ఒక్కరూ సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలని స్థానిక కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తో బిల్ కలెక్టర్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.





## ప్లాస్టిక్ రహిత డివిజన్ గా తీర్చిదిద్దుతా ..

వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి మంగళవారం ఉదయం స్థానిక డివిజన్ లో మునిసిపల్ ఎంహెచ్ఓ రాజేష్, సూపర్ వైజర్ భాస్కర్, ఇన్ స్పెక్టర్ ఇస్రం శ్రీను, జావాన్ కిరణ్, జీవన్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మున్సిపల్ సిబ్బందితో కలిసి వాడవాడకు తిరుగుతూ పారిశుద్ధ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ ని ప్లాస్టిక్ రహిత డివిజన్ గా తీర్చిదిద్దాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే దిశగా ప్రయత్నాలు చేయాలని, ప్రజల్లో చైతన్య కల్పించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు.

# విద్యార్థిని శ్రీ చైతన్యను అభినందించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** మండలంలోని లక్ష్మీ నారాయణపురం గ్రామానికి చెందిన, విద్యార్థిని గూడా శ్రీ చైతన్య ఇటీవల ఖమ్మం పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని శ్రీ చైతన్యను శాలువా కప్పి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కరాటే శరీర దృఢత్వానికి, స్వీయ రక్షణకు దోహదపడుతుందన్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మజ్జిగ కొమురయ్య, విద్యార్థిని తండ్రి గూడా రవీందర్, తదితరులున్నారు.

# బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యం



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో పరకాల పట్టణ అధ్యక్షుడు కోయ్యడ శ్రీనివాస్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, డైరెక్టర్ బొమ్మకంటి రుద్రమదేవిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఐక్యతతో కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల అభ్యున్నతికి పనిచేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.500లకు గ్యాస్ పంపిణీ, కల్యాణ లక్ష్మి–షాదీముబారక్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, మహిళా సంఘాలకు రుణాలు అందించిందని పేర్కొన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఇంటిగ్రేటెడ్ గురుకులానికి రూ. 200 కోట్ల బడ్జెట్ మంజూరు చేయించిన ఘనత మన పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డిది అని అన్నారు. పరకాల నియోజకవర్గంలో అభివృద్ధి ప్రదాతగా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిదేనని, అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పై పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ దేశంలో ప్రప్రథమంగా కుల జనగణన సర్వే చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కిందని గుర్తు చేశారు. కుంకుమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కోలుగురి రాజేశ్వరరావు, ఉమ్మడి పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మ కంటి చంద్రమౌళి, సమన్వయ కమిటీ సభ్యులు ఒంటేరు రామ్మూర్తి, ఎండి రంజాన్ అలీ, దుబాసి వెంకటస్వామి, మార్క రఘుపతి గౌడ్, పసుల రమేష్, బండి సదానందం గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఒంటేరు చిన్న సారయ్య, బొచ్చు మోహన్, పరకాల పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పోరండ్ల వేణు, గడ్డం శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ఆర్సీ వరంగల్ జిల్లా చైర్మన్‌గా గంగుల అశోక్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మానవ హక్కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన గంగుల అశోక్ ను నియమిస్తూ స్టేట్ చైర్మన్ బద్దిపడిగా శ్రీనివాస్ రెడ్డి నియామక పత్రాన్ని అశోక్ కు అందజేశారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షులకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ హెచ్ఆర్సీ సంస్థలో తన కర్తవ్యాన్ని క్రమశిక్షణతో నెరవేస్తానని తెలిపారు. ఎల్లప్పుడూ రాష్ట్ర అధ్యక్షులకు, జిల్లా తోటి సభ్యులకు అన్ని విధాలుగా సహకారం అందజేస్తానన్నారు. పేద ప్రజల తరపున చట్టపరమైన దిశలో మానవ హక్కుల చర్యలో తోడ్పాటును నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆపదలో ఉండే ఈ వ్యక్తికైనా ఎన్ హెచ్ఆర్సీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

## వన్నాలను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల సతీ వియోగం కలిగిన వర్ధన్నపేట మాజీ శాసన సభ్యుడు, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వన్నాల శ్రీరాములును మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మంగళవారం పరామర్శించారు. వన్నాల శ్రీరాములు సతీమణి స్వర్గీయ వన్నాల విజయలక్ష్మి హఠాన్మరణం గురించి ఎర్రబెల్లి దయాకర్ రావు అడిగి తెలుసుకొన్నారు. కీ॥శే॥వన్నాల విజయలక్ష్మి మరణం పట్ల ఎర్రబెల్లి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వన్నాల శ్రీరాములు అతని ముగ్గురు కుమారులు డాక్టర్ వన్నాల వెంకట రమణ, వన్నాల అరవింద్ కుమార్, వన్నాల రాకేష్ కన్నాలకు సానుభూతి తెలిపి మనోధైర్యాన్ని నింపారు. దివంగత వన్నాల విజయలక్ష్మి దశదినకర్మ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేయగా ఎర్రబెల్లి దయాకర్ రావు అదే రోజు ఓబుళాపురం మైనింగ్ కేసు విచారణలో భాగంగా విజయవాడ హైకోర్టుకు హాజరు కావలసి ఉన్నందున మంగళవారం వన్నాల శ్రీరాములును, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ మాజీ శాసనసభ్యులు మార్తినేని ధర్మారావు, జర్నలిస్టు వేముల సదానందం నేత, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ కోశాధికారి గజ్జెల్లి రవీందర్ పాల్గొన్నారు.


## హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దిడ్డి రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రాంత హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దిడ్డి రమేష్ ను నియమిస్తూ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు బచ్చు ఆనందం, ఆడెపు రవీందర్లు నియామక పత్రం అందజేశారు. మంగళవారం వరంగల్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దిడ్డి రమేష్ ను ప్రధాన కార్యదర్శిగా నియమించామని, పద్మశాలి సంఘంలో గత కొద్ది సంవత్సరాలుగా ఉత్సాహంగా పనిచేస్తూ, కులాభివృద్ధికి పాటుపడుతున్నందుకు సేవలను గుర్తించి నియమించినట్లు పద్మశాలి సంఘ పెద్దలు తెలిపారు. నా నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు అభినందనలు తెలిపిన రమేష్ సంఘ కార్యక్రమాలకు, పద్మశాలి కులాభివృద్ధికి నా వంతు సహకారాన్ని అందిస్తూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, పసునూటి భిక్షపతి పాల్గొన్నారు.

## తాడిచెర్లలో ఫ్రిడ్జ్ పేలి ఇల్లు ధ్వంసం

### షార్ట్ సర్క్యూట్ తోనే ప్రమాదం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల కేంద్రమైన తాడిచెర్ల ఎస్సీ కాలనీలోని కుమార్ అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు ఫ్రిడ్జ్ పేలింది. ప్రమాద దాటికి ఇల్లు పూర్తిగా కాలి పోగా పక్కన ఇల్లు పాక్షికంగా ధ్వంసమయ్యింది. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కావడం వల్లనే ప్రమాదం సంభవించిందని ప్రాథమిక సమాచారం. ఈ ప్రమాదంలో నిత్యావసర వస్తువులతో పాటు బట్టలు, బంగారం, ఇంట్లో దాచిన నగదు కాలిపోయినట్లు బాదితులు తెలిపారు. ఫ్రిడ్జ్ పేలి మంటలు ఇంటికి అంటుకోవడంతో సమీప గ్రామస్థులు నీటితో మంటలను ఆర్పారు. సంఘటనా స్థలానికి మండల రెవెన్యూ సిబ్బంది చేరుకుని తక్షణ సహాయం కింద బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల వరకు నష్టం జరిగిందని అధికారులు స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# జీనోమ్ ప్రాజెక్టతో వ్యాధుల గుట్టు రట్టు

**➲ కేయూ వీసీ ప్రొ.ప్రతాప్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, కేయూ :** 2010లో ప్రారంభమైన జీనోమ్ ప్రాజెక్ట్ మానవుడి వ్యాధులకు కారణమైన జన్యువులను గుర్తించి వాటి మూలాల ద్వారా వ్యాధుల గుట్టును రట్టు చేయవచ్చని కేయూ ఉపకులపతి ప్రో. ప్రతాపరెడ్డి అన్నారు. జన్యుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఇమ్యూనాలజీ, బయోటెక్నాలజీ అంశంపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ సెమినార్ లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ సదస్సుకు భారతదేశం నుంచి పరిశోధకులు, అకడమిషియన్లు పాల్గొని జంతు శాస్త్రాల పరిశోధన పురోగమనంపై చర్చించడాన్ని కొనియాడారు. ఇటువంటి సదస్సులో జంతు బయోటెక్నాలజీ, సెల్ అండ్ టిష్యూ కల్చర్, సెల్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ, ఇమ్యూనాలజీ, జంతు శరీరశాస్త్రం, జీవరసాయనం, పర్యావరణ జీవశాస్త్రం, పునరుత్పత్తి బయోటెక్నాలజీ, అభివృద్ధి జీవశాస్త్రం, పర్యావరణ, టాక్సికాలజీ వంటి అంశాలలో చర్చలు జరగడం, అదనంగా, కృత్రిమ పెంపకం, మత్స్య పరిశ్రమ, ఆహారం, పోషణ వంటి అనుబంధ రంగాలలో అనుసంధానాన్ని, జన్యు ఇంజినీరింగ్, బయోఇన్ఫర్మేటిక్స్, జెనోమిక్స్, ప్రోటియోమిక్స్, మెటబొలోమిక్స్ వంటి ఆధునిక సాంకేతికతల ప్రాముఖ్యతను వివరించడాన్ని నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. జాతీయ సదస్సులో బయో ఫార్మా డైరెక్టర్ ప్రొ. గీతా శర్మ 'డ్రగ్ డిస్కవరీ 'పై కీలకోపన్యాసం చేశారు. ప్రొ. గీతా శర్మ మాట్లాడుతూ ఒక మాలిక్యుల్ ఒక డ్రగ్ గా మార్కెట్ లోనికి రావడానికి తక్కువలో తక్కువగా 10 సంవత్సరాలు పడుతుందని, అంతేకాకుండా 10 బిలియన్ డాలర్ల వరకు ఖర్చు అవుతుందని కానీ, బాయో ఇన్ఫర్మాటిక్స్ అభివృద్ధి చెందినందున ఖర్చు, సమయం రెండూ కలిసి రావడం పరిశోధన రంగంలో జరిగిన పురోగతి అని పేర్కొన్నారు. జాతీయ సదస్సు నిర్వాహకులు ప్రొ.వెంకయ్య మాట్లాడుతూ, ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో 100కి పైగా రీసెర్చ్ స్కాలర్స్, వివిధ వర్శిటీలకు చెందిన ప్రొఫెసర్లు తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తున్నారని తెలిపారు. ఈ సదస్సులో మాట్లాడడానికి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అనిమల్ బయోటెక్నాలజీ నుండి, నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, జే.ఎన్.టీ.యూ.ఎచ్ నుంచి ప్రొఫెసర్లు, సైంటిస్టులు వస్తున్నారని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షుడిగా జన్యుశాస్త్రం విభాగ అధిపతి ప్రో.శమిత, విశిష్ట అతిథిలుగా సైన్స్ డీన్ ప్రొ.హన్మంతు, చైర్మన్ బోర్డు ఆఫ్ స్టడీస్ ప్రొ.ఈశం నారాయణ, ప్రొ.ఇస్తారిలు పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన అతిథులు జాతీయ సెమినార్ కు వచ్చిన పరిశోధనా పత్రాల సావనీర్ పుస్తకాన్ని వేదిక మీద ఆవిష్కరించారు.

# తండ్రిని కాదంటున్న కొడుకులు

- పింఛను డబ్బులకై గొడవలు
- ప్రజావాణిలో బాధితుడి ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** ఆయనో రిటైర్డ్ టీచర్, కష్టపడి చదువుకొని బడిపంతులు అయ్యాడు.. వేల మంది పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పారు.. రిటైర్మెంట్ అయ్యాక కన్న కొడుకులతో ఆనందంగా కాలక్షేపం చేస్తామనుకున్న తండ్రి ఆశలు అడియాశలయ్యాయి. 16 ఎకరాలు భూమి పంచి ఇచ్చిన, పింఛన్ డబ్బుల కోసం కన్న కొడుకులు కాదనడంతో ప్రజావాణిలో కలెక్టర్ తనకు న్యాయం చేయమని విన్నవించుకున్న ఘటన పలువురిని ఆలోచింప చేస్తుంది. వివరాలలోకి వెళితే.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన పిల్లల నారాయణకు ఈ కష్టం వచ్చింది.. ఆయన చెప్పిన ప్రకారం పిల్లల నారాయణకు నలుగురు కొడుకులు, నలుగురు బిడ్డలు.. నలుగురు కొడుకుల్లో ముగ్గురు ఉద్యోగులు కాగా, ఒకరు వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే ఉంటున్నారు. కొద్ది సంవత్సరాల క్రితమే విశ్రాంత ఉద్యోగి నారాయణ కన్న కొడుకులకు 16 ఎకరాల భూమిని పంచి ఇచ్చాడు. తర్వాత తన వద్ద రెండు ఎకరాల భూమి ఉంచుకొని రెండో కొడుకు వెంకటేశ్వర్లు వద్ద కాలం గడుపుతున్నాడు. అయితే కొద్ది కాలంగా పింఛన్ డబ్బుల విషయంలో కన్నకొడుకులు ఇబ్బందులు పెట్టడంతో వృద్ధుడైన పిల్లల నారాయణ అనేక ఇబ్బందులు పడుతున్నాడు. వారి ఇబ్బందులు తట్టుకోలేక సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కు తమ గోడు చెప్పుకుంటూ న్యాయం చేయాలని వేడుకున్నాడు. అంతేకాకుండా తనకు చెందిన మిగతా రెండు ఎకరాల భూమిని ఎవరికైనా దానధర్మం చేస్తాను గానీ, నా కొడుకులకు పంచి ఇవ్వనని, వాళ్లకు అధికారం లేకుండా చేస్తానని బాధపడ్డాడు.. కాగా, ఈ సంఘటన స్థానికులను కలచివేయగా, విద్యా వంతులైన ఇంట్లో ఇలాంటి సమస్య రావడం బాధాకరమని పలువురు పలు రకాలుగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఎయిడ్స్ మహమ్మారిని సమిష్టిగా నిర్మూలిద్దాం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎయిడ్స్ మహమ్మారిని సమిష్టిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా అదనపు వైద్య అధికారి డాక్టర్ మదన్మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం సంపూర్ణ సురక్ష కేంద్రం, ఛాతీ, టిబి హాస్పిటల్ ఆధ్వర్యంలో మేనేజర్ ఇక్బాల్ పాషా అధ్యక్షతన మెగా హెల్త్ క్యాంపు జితేందర్ సింగ్ నగర్, హనుమకొండలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ మదన్మోహన్ మాట్లాడుతూ దాదాపు 148 మందిని ఓపీ చూశామని, ఇందులో అందరికీ జనరల్ చెకప్ తో పాటు బీపీ షుగర్, డెంగ్యూ, మలేరియా,హెచ్ఐవి/ఎయిడ్స్, సిఫిలిస్, హెపటైటిస్ బి, సి, సాధారణ పరీక్షలతో పాటు స్త్రీ వైద్య నిపుణులచే స్త్రీలను కూడా పరీక్షలు చేయడం జరిగిందన్నారు. అలాగే ఎయిడ్స్ వ్యాధి నిర్మూలించేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో ఎయిడ్స్ నిర్మూలించేందుకు కౌన్సిలర్, ల్యాబ్ టె క్నీషియన్స్ వివిధ స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయని ఈ నెలాఖరు వరకు ఎక్కువ మందికి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్ పర్యవేక్షణలో, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ప్రజలకు విస్తృతంగా ఎయిడ్స్ వ్యాధి నివారించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరానికి డాక్టర్ పి.సునీత, సూపరింటెండెంట్ ఛాతీ, టీబీ హాస్పిటల్ హనుమకొండ , డాక్టర్ శ్రీనివాస్ మెడికల్ ఆఫీసర్ టీబీ హాస్పిటల్, డాక్టర్ గీత మెడికల్ ఆఫీసర్ జీఎంహెచ్, డాక్టర్.శ్రవణ్, డాక్టర్.అరుణ్, రాపర్తి సురేష్ ఐసీటీసీ కౌన్సిలర్, రామ్ కుమార్, డీఎస్ ఆర్సీ కౌన్సిలర్, సౌరమ్ రఘు జనరల్ సెక్రెటరీ జితెందర్ సింగ్ నగర్, హెల్త్ సూపెర్ వైజర్ రాజేష్, సంపూర్ణ సురక్ష కేంద్రం ఓఆర్ డబ్ల్యూఎస్ రాజేంద్ర ప్రసాద్, సరితా, టీబి సెంటర్ కోఆర్డినేటర్లు సుధాకర్, కిరణ్, నాగేష్, విజయ్ మోహన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్, మారి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ సీన్ ఎప్పటీ మరిచిపోలేను




## యాడ్స్‌తోనే సంపాదిస్తున్నా : ప్రియావారియర్

నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. షార్ట్ ఫిల్మ్స్ ద్వారా ఫేమస్ అయ్యింది.తర్వాత సినీరంగంలోకి నటిగా ఎంట్రీ ఇచ్చింది. కథానాయికగా ఆమె నటించిన ఫస్ట్ మూవీ సంచలన విజయం సాధించింది. ముఖ్యంగా అందులో ఆమె కనిపించిన సీన్స్ సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో దూసుకుపోయాయి. కట్ చేస్తే.. స్టార్ హీరోయిన్‌గా క్రేజ్ సొంతం చేసుకుంది. కానీ అందం, అభినయం కట్టిపడేసిన ఈ బ్యూటీకి అదృష్టం మాత్రం కలిసిరావడం లేదు. ఆమె నటించిన చిత్రాలు డిజాస్టర్స్ కావడంతో నెమ్మదిగా అవకాశాలు తగ్గిపోయాయి. కానీ సోషల్ మీడియాలో గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆ బ్యూటీ మాట్లాడుతూ.. తనకు ఎవరూ అవకాశాలు ఇవ్వడం లేదని.. కానీ తాను మాత్రం సోషల్ మీడియా పేజీల ద్వారా ఆదాయం సంపాదిస్తున్నానని తెలిపింది హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. ఒకే ఒక్క సినిమాతో మలయాళీ ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న నటి ప్రియా ప్రకాష్ వారియర్. ఒమర్ లులు దర్శకత్వం వహించిన ఒరు అదార్ లవ్ చిత్రంలోని ఒక పాటలో కన్నుగీటుతూ కనిపించి ఒక్కసారిగా ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత నెట్టింట తెగ ట్రెండ్ అయ్యింది. అలాగే మలయాళంలో వరుస ఆఫర్స్ అందుకుంది. ఒక్క రోజులోనే లక్షలాది మంది ఆ నటిని ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అయ్యారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రకటనలు, ప్రమోషన్ ద్వారా దృష్టిని ఆకర్షించింది. దీనివల్ల స్టార్‌కు మంచి ఆదాయం వచ్చింది. ఈ విషయాన్ని ఆ స్టార్ స్వయంగా బహిరంగంగా చెప్పడంతో ఇప్పుడు అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా లేకపోయినా బ్రాండ్ల నుండి ప్రకటనలు వస్తున్నందుకు ఉపశమనం కలిగిస్తోందని తెలిపింది. కానీ తన లక్ష్యం మాత్రం సినిమాల్లో నటించడమే అని తెలిపింది.

# ప్రేమ వ్యాపారంగా మారితే.. విడిపోవడమే బెటర్ : తమన్నా

పెళ్లి కాకముందే బెస్ట్ కపుల్స్ అనిపించుకున్నారు తమన్నా, విజయ్‌వర్మ. అయితే.. ఇప్పుడు హటాత్తుగా ఇద్దరూ విడిపోయారనే వార్తలు మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే.. ఈ విషయాన్ని వారు మాత్రం ధృవీకరించలేదు. అయితే.. ఇటీవలే ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ తమన్నా మాట్లాడిన మాటలు.. వారి బ్రేకప్‌కు బలాన్నిస్తున్నాయి. ప్రేమలో స్వేచ్ఛ ఉండాలి. కట్టడి ఉండకూడదు. ప్రేమలో ఎమోషన్స్ ఉండాలి. అంచనాలు ఉండకూడదు. అలా వుంటే అది ప్రేమకాదు. వ్యాపారం అవుతుంది. ఎప్పుడైతే ప్రేమ వ్యాపారంలా మారుతుందో.. అప్పుడు కలిసి ఉండటం కంటే విడిపోవడం బెటర్.' అంటూ స్పందించింది తమన్నా. ఆమె మాటలు విన్న వారంతా బ్రేకప్ విషయంపై ఓ అభిప్రాయానికి వచ్చేస్తున్నారు.



# రామ్‌చరణ్‌తో గిన్నెలు తోమించిన సుకుమార్



తండ్రికైన కొడుకుపైన మమకారం ఎక్కువే ఉంటుంది. కొడుకుకి ఏమైందని తెలిస్తే తండ్రి అల్లాడిపోతాడు. రామ్ చరణ్ విషయంలో చిరంజీవి కూడా ఓ సారి చాలా బాధని దిగమింగుకున్నాడట. మగధీర సినిమా సమయంలో చరణ్ కొన్ని ప్రమాదకరమైన స్టంట్స్ చేస్తుంటే చిరంజీవి చూడా ఎంతగానో భయపడ్డారంట. అప్పుడే తన తండ్రి కూడా చిరంజీవి చేసే స్టంట్స్ చూసి ఎంత బాధపడ్డారోనని రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఇదే కాక మెగా వారసుడిగా ఇండస్ట్రీకి వచ్చిన రామ్ చరణ్ ఆర్ఆర్ఆర్ సినిమాతో గ్లోబల్ స్టార్‌గా ఎదిగాడు. ఆయనతో దర్శకుడు సుకుమార్ గిన్నెలు తోమించాడట. రామ్ చరణ్–సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కిన క్రేజీ ప్రాజెక్ట్ రంగస్థలం. ఈ సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఫేస్‌లోనే విభిన్న భావోద్వేగాలను పలికించి వావ్ ా అనిపించాడు. అప్పట్లో నాన్ బాహుబలి రికార్డులు బ్రేక్ చేసన ఈ చిత్రం 200 కోట్లకుపైగా వసూళ్లని రాబట్టింది. చెవిటి వ్యక్తిగా రామ్ చరణ్ అద్భుతమైన నటనతో అదరగొట్టాడు. చిత్రంలో రామ్ చరణ్.. గిన్నెలు తోమడం, టాయిలెట్ తీసే సీన్లు ఉన్నాయి. అయితే ఆ సీన్స్ రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోచేత సుకుమార్ చేయించడంతో ఫ్యాన్స్ కాస్త అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు ఆ సీన్స్ ఏదైన జిమ్మిక్కులు చేసి తీద్దామన్నా కూడా రామ్ చరణ్ తానే స్వయంగా చేస్తానని అన్నాడట. ఈ విషయం చిరంజీవికి తెలిశాక ఆయన రియాక్షన్‌కి వావ్ అనాల్సిందే. రోజూ ఇంట్లో గిన్నెలు తోమే అలవాటు ఉన్నట్టుగా రామ్ చరణ్ ఆ సీన్‌లో చేశాడని, చాలా అనుభవం ఉన్న వ్యక్తిలాగా, బాగా పాత్రలో ఇన్‌వాల్వ్ అయి చేశాడని, అందుకే అది అంత సహజంగా వచ్చిందని ఆ సన్నివేశం గురించి సుకుమార్ ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. చరణ్ అలా చేస్తుంటే మేము షాక్ అయ్యాం. చిరంజీవి ఈ సీన్ చూసి..ఈ సీన్ నువ్వే చేసి చూపించావ్ కదా చరణ్‌కి అని అడిగితే, లేదు సార్, నేను ఏం చెప్పలేదు. చరణ్ ఆ పాత్రని ఓన్ చేసుకొని నటించాడని సుకుమార్ అన్నాడట. చిరు అస్సలు నమ్మలేదు. అయితే రామ్ చరణ్ వంట చేసి రుచి చేసే సీన్ కూడా సహజంగా చేసాడని సుకుమార్ అన్నాడట. దానికి చిరు చాలా సర్‌ప్రైజ్ అయ్యాడట.



# రష్మికకు మద్దతుగా నిలిచిన కొడవ

కొడవ హక్కుల పరిరక్షణ సంస్థ కొడవ నేషనల్ కౌన్సిల్ నటి రష్మిక మందన్న భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కొనసాగుతున్న రాజకీయ వివాదాల మధ్య ఆమెకు భద్రత కల్పించాలని కేంద్ర, కర్ణాటక హోం మంత్రులను కోరింది. నటి రష్మిక మందన్న కర్ణాటకలోని కొడవ కమ్యూనిటీకి చెందినవారు. ఆమె బేస్ కొడగు ప్రాంతం. ఆమె కొడవ వారసత్వం కారణంగా నటిని అన్యాయంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి గనిగ నటిపై తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో ఈ అభ్యర్థన చేసింది. రష్మిక కృషి, ప్రతిభతో గొప్ప పేరు తెచ్చుకుంది. కొందరు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఆమెను అనవసరమైన రాజకీయ చర్చల్లోకి లాగుతున్నారని అధ్యక్షుడు నందినేర్వండ నాచప్ప ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెను మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఆమె ఎదుగుదలకు.. రాజకీయాలతో సంబంధం లేదని.. ఆమెను రాజకీయ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కొందరు వ్యక్తులు, కళాత్మక స్వేచ్ఛ గురించి తెలియక, ఆమెను టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు.

కర్ణాటకలోని మాండ్య నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రవికుమార్ గనిగ.. రష్మిక కన్నడ చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేసి బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి హాజరు కావడానికి నిరాకరించారని ఆరోపిస్తున్నారు. ఆమె 2010లో కన్నడ చిత్రం కిరిక్ పార్టీలో ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేసిందని.. కానీ ఇప్పుడు ఎన్ని ఆహ్వానాలు ఇస్తున్నా ఆమె కర్ణాటకను సందర్శించడానికి నిరాకరిస్తుందని చెబుతున్నారు. రష్మికను ఒక కార్యక్రమానికి ఆహ్వానిస్తే కర్నాటక ఎక్కడ ఉందని అడిగిందని, ఆమెకు సరైన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రష్మికపై ఎమ్మెల్యే రవి విమర్శల నేపథ్యంతో వెంటనే భద్రత కల్పించాలని కోరారు నాచప్ప. రష్మిక ఇప్పటివరకు ఈ వివాదంపై ఎలాంటి స్పందన ఇవ్వలేదు. అయితే, సోషల్ మీడియాలో మాత్రం ఆమెకు మద్దతుగా అభిమానులు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు.


వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, మార్చి 11, 2025



# కళ్లుండి చూడలేని కబోది హరీష్ రావు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- ఎమ్మెల్యే హరీష్ రావు వ్యాఖ్యలపై ఫైర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కళ్లుండి చూడలేని కాబోది హరీష్ రావు అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మాటలపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమాల జిల్లా, సమైక్య జిల్లాను మీ రాజకీయ ఉనికి కోసం ఆరు జిల్లాలుగా విభజించారని, సభ పేరుతో ఆలీబాబా చోర్ ముఠా వస్తుందని విమర్శించారు. బీజేపీకి కొమ్ముకాసే మీరు ఆత్మగౌరవం గురించి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. పోరాటాలు, ఉద్యమాల పేరుతో పబ్బం గడపడం మీకు వెన్నతో పెట్టిన విద్య అని, అబద్ధాన్ని నిజం చేయటంలో కేటీఆర్, హరీష్ దిట్ట అని విమర్శించారు. మీరు కోవర్ట్ రాజకీయాలు చేసి రేవంత్ రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని మండిపడ్డారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉంటారని డైవర్షన్ పాలిటిక్స్ మానుకుని మీ రాజకీయ సభ వల్ల మాకు సంబంధం లేదన్నారు. పదేళ్లలో కాంగ్రెస్ నాయకులపై ఇష్టారాజ్యంగా కేసులు పెట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు. మీ భాగోతాల్ని తప్పకుండా ప్రజల్లో ఉండేలా చూస్తామని, రాష్ట్ర స్థాయి నాయకత్వం లేకపోయినా వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపించారన్నారు. పదేళ్లలో మీరు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ,ప్రజలను మోసం చేయడానికి సభ పేరుతో దొంగల బ్యాచ్ వస్తుందని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరంగల్ వచ్చిన ప్రతిసారి మమ్మల్ని మాటలతో మోసం చేశారని, ఇచ్చిన మాటలకు కట్టుబడి ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం మాది అని అన్నారు. దళిత బంధు పేరుతో ట్రాక్టర్ల పేరుతో, ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. జీతం తీసుకుని ఫార్మ్ హౌజ్ లో ఉంటే ఎలా ముఖ్యమంత్రి అని విమర్శించారు. దీన్ దయాళ్ నగర్,పెద్దమ్మగడ్డ, సమ్మయ్య నగర్ లో అభివృద్ధి చూడండని, రాజకీయం మీకు వ్యాపారం లాంటిదని మండిపడ్డారు. రాజకీయం మాకు ప్రజా సేవలాంటిదని తెలిపారు. ప్రమాదకరమైన పార్టీ బీఆర్ఎస్ అని, అధికారంకోసం ఎంతమందినైనా మోసం చేస్తారని దుయ్యబట్టారు. చేసేది తప్పులు- చెప్పేది గొప్పలు అని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలుస్తారని అనడం మానేసి ఎంపీ ఎన్నికల రిజల్ట్ పై సమీక్ష చేసుకోండని చురకలంటించారు. పదేళ్ల మీ పాలన అభివృద్ధి, 15 నెలల మా పాలనపై బహిరంగ చర్చకు హరీష్ రావు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రామప్పలో స్పెయిన్ దేశస్థుడు

- స్వామి వారికి ప్రత్యేక పూజలు
- చెరువులో బోటు షికారు

**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని మంగళవారం స్పెయిన్ దేశానికి చెందిన జ్వాన్ సందర్శించారు. ఈ సందర్బంగా జ్వాన్ రామలింగేశ్వర స్వామిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఆలయ అర్చకులు జ్వాన్ కి స్వామివారి ఆశీస్సులను, తీర్థప్రసాదాలను అందించారు. ఆనంతరం జ్వాన్ కి ఆలయ విశిష్టత, శిల్ప కళాసంపద గురించి టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ వివరించారు. తదనంతరం జ్వాన్ రామప్ప చెరువు వద్దకు చేరుకొని చెరువులో బోటుషికారు చేస్తూ పకృతి అందాలను తిలకించారు.

# 16న సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయండి
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, జనగామ :** 16న సీఎం పర్యటనను విజయవంతం చేయాలని, శంకుస్థాపనలకు సంబంధిచిన శిలాఫలకాలు, డిజైన్ నమూనాలు ఇతరత్ర పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు తెలిపారు. జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్లు, డీసీపీలతో కలిసి జిల్లా అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 సాయంత్రం లోగా శంకుస్థాపనలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, ఏవైనా లోటు పాట్లు ఉంటే సరిచేసుకోవడానికి వెసులుబాటు ఉంటుందన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే నా దృష్టికి గాని, కలెక్టర్ దృష్టికి గాని తీసుకురావాలని అధికారులకు సూచించారు. 16 మధ్యాహ్నం 12:00గంటలకు ముఖ్యమంత్రి ఘనపూర్ సభా స్థలికి చేరుకుంటారని, 12:30 గంటల నుంచి 01:00 గంటల వరకు శంకుస్థాపనలు, 01:00 గంటల నుంచి 02:30గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. శంకుస్థాపనలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు శిలాఫలకాలు, డిజైన్ నమూనాల వంటి ఏర్పాట్లు చేసుకోవాలని, అలాగే ప్రోటోకాల్ కు కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇంకా కేవలం 4రోజుల సమయం మాత్రమే ఉన్నందున అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సభా ఏర్పాట్లకు సంబంధించి డయాస్, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వీవీఐపీ పార్కింగ్, ఆయా మండలాల నుండి వచ్చే వాహనాల పార్కింగ్ వంటి ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ ఎలాంటి ఇబ్బంది రాకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని తెలిపారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా కింది స్థాయి వరకు పర్యవేక్షణతో పని చేయాలని తెలిపారు. ఇందుకు జిల్లా అధికారులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, పోలీస్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# కమిషనరేట్ ఎదుట వ్యక్తి ఆందోళన

- తమ్ముడు తన భూమిని కబ్జా చేశాడని ఆరోపణ
- న్యాయం చేయాలని సీపీకి విజ్ఞప్తి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం పొనకల్ గ్రామానికి చెందిన గట్ల సురేందర్ అనే వ్యక్తి మంగళవారం వరంగల్ పోలీస్ కమిషరేట్ వద్ద అర్ధ నగ్నంగా తన సొంత తమ్ముడు తన భూమిని కబ్జా చేశాడని ఆరోపిస్తూ హల్ చల్ చేశాడు. తనకు రావలసిన వాటా సుమారు మూడు ఎకరాల భూమిని మాజీ సర్పంచ్ ల అండతో అతని తమ్ముడు భూమి కబ్జా చేశారని ఆరోపించారు. పోనకల్ గ్రామాన్ని లంచగొండుల గ్రామం అని నామకరణం చేయాలనీ ఫ్లెక్సీ లో పేర్కొన్నాడు. అలాగే దుగ్గొండి మండల గత తహసీల్దార్ ఎలాంటి డాకుమెంట్స్ పేపర్లు లేకుండా తన తమ్ముడికి పట్టా పాస్ బుక్ ఇచ్చారని, వాటిని రద్దు చేసి రైతు బంధు పడకుండా చేయాలని విజ్ఞప్తి చేశాడు. పూట కోసం సొంత అన్నదమ్ములకు భూ తగాద పెట్టిన గ్రామ లంచ గొండులను, అవినీతి దారులను గ్రామంలో అవినీతి మాట్లాడే వారిని చెప్పుతో కొట్టండి ప్రజలారా అని ఫ్లెక్సీ లో పేర్కొన్నాడు. అధికారులు, పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రికి అతను విజ్ఞప్తి చేస్తూ అవినీతి చేసిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

St. Joseph's High School
Kumarpally, Hanumakonda.
WANTED TEACHERS
Applications are invited from qualified and experienced teachers who are basically from English Medium to teach the following subjects:
● ENGLISH (H.S) ● P.E.T.
● Kindergarten
Written Test & Oral Interview will be on 05-04-2025 at 09-00 am.
Interested and Eligible candidates are invited to submit the application on or before 28th March, 2025.
Ph: 9000127176 Sd/- Headmistress




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com